

ఆస్ట్రేలియా కంపెనీ బాధ్యులతో..

ఆస్ట్రేలియాకు చెందిన మైనింగ్ టెక్నాలజీ బాధ్యులతో సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి సమావేశమయ్యారు.

8లో



టీయూసీఐలో ఇఫ్టూ విలీనం

టీయూసీఐలో ఇఫ్టూ విలీనం కానుంది. నేడు హైదరాబాద్‌లో జరిగే సమావేశంలో ప్రకటన చేయనున్నారు.

8లో

గరిష్ఠం / కనిష్ఠం

32° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం నుంచి పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

బాలికలపై ఆగని అత్యాచారాలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆవేదన



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్: పోక్సో చట్టం కింద నిందితులకు న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధిస్తున్నా బాలికలపై అత్యాచారాలు ఆగటం లేదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ), బార్ అసోషియేషన్ నిర్వహించిన న్యాయవాద వృత్తి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నూతన మేజర్ చట్టాల అమల్లో సందేహాలు తలెత్తుతున్నాయని, అవి పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏఐఎల్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, కొత్తగూడెం బార్ అసోషియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఏఐఎల్‌యూ జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్, సీనియర్ న్యాయవాది సీవీఎల్ఎన్ మూర్తి, వావిలాల ఆశ తదితరులు చట్టాలు, హక్కులు, న్యాయవాదుల సమస్యలపై బోధించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎల్‌యూ జాతీయ కౌన్సిల్ సభ్యులు జే.శివరాంప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.కిషన్‌రావు, జిల్లా కోశాధికారి కిలారు పురుషోత్తంరావు, కె.అన్నపూర్ణ, సుడిగాలి వెంకట నర్సయ్య, బండారు అరుణ్‌చంద్, మేదర మెట్ల శ్రీనివాస్‌రావు, ఉడతనేని శ్రీనివాస్‌రావు, టి.చైతన్య, పాయం రవివర్మ, రావిలాల రామారావు, అరికాల రవికుమార్, దూదిపాల రవికుమార్, తెల్లబోయిన రమేష్, ఉప్పు అరుణ్ పాల్గొన్నారు.

'సింగరేణి' ఫలితాలు విడుదల

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో 327 పోస్టులకు సంబంధించి ఫిబ్రవరిలో విడుదల చేసిన నోటిఫికేషన్ తుది ఫలితాలను యాజమాన్యం శనివారం విడుదల చేసింది. ఆగస్టు 6, 7వ తేదీల్లో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఏర్పాటు చేసిన 32 కేంద్రాల ద్వారా కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు 29,291 మంది అభ్యర్థులు హాజరుకాగా, ఫలితాలను సింగరేణి వెబ్‌సైట్ www.scclmines.comలో పొందుపర్చినట్లు యాజమాన్యం వెల్లడించింది. మేనేజ్‌మెంట్ ట్రెయినీ 42 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రెయినీ (సిస్టమ్స్) ఏడు, జేఎంఈటీ–100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ (మెకానికల్) 9 పోస్టులు, అసిస్టెంట్ ఫోర్‌మెన్ (ట్రెయినీ) ఎలక్ట్రికల్ 24 పోస్టులు, ఫిట్టర్ ట్రెయినీ 47పోస్టులతో పాటు ఎలక్ట్రీషియన్ ట్రెయినీ 98 పోస్టులు ఈ నోటిఫికేషన్‌లో ఉన్నాయి.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

సుజాతనగర్: వరి, పత్తి పంటల్లో సోకిన తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ వి.లక్ష్మీనారాయణమ్మ సూచించారు. రైతు వేదికలో శనివారం యాజమాన్య పద్ధతులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. వాతావరణ సమస్యలు, తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా వరిలో బ్యాక్టీరియా, ఎండు తెగులు ఆశిస్తున్నట్లు తెలిపారు. పత్తి పంటలో తెల్లదోమ ఉధృతి అధికంగా ఉందన్నారు. నివారణ కోసం పత్తి చేలలో జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మునగ సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శరత్, ప్రనూష, నర్సింహారావు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ అందక..

మెడికోల ఆర్థిక ఇబ్బందులు

- రెండేళ్లుగా మంజూరుకాని ఉపకార వేతనాలు
- ప్రభుత్వ వైద్య కళాశాలకు కోడ్ కేటాయించని నేషనల్ మెడికల్ కౌన్సిల్
- ఫలితంగా దరఖాస్తు చేసుకోలేకపోతున్న ఆలిండియా కోటా విద్యార్థులు



ప్రభుత్వ వైద్య కళాశాల

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందడం లేదు. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో మెడికోలకు ఉపకార వేతనాలు రావడంలేదు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి కోడ్ రాకపోవడంతో కళాశాల పేరు ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్‌ఈ) వెబ్‌సైట్‌లో నమోదు కాలేదు. దీంతో ఆల్ ఇండియా కోటాలో చేరిన విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. కోడ్ వస్తేనే ఏఐఎస్‌హెచ్‌ఈ వెబ్‌సైట్‌లో జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల పేరు కనిపిస్తుంది. అప్పుడు ఆల్ ఇండియా కోటాలో చేరిన విద్యార్థులు స్కాలర్ షిప్‌నకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ రెండేళ్లుగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి వైద్య కళాశాలకు కోడ్ కేటాయించడంలేదు. ఫలితంగా 2022 నుంచి 2024 వరకు చేరిన ఇతర రాష్ట్రాల విద్యార్థులు ఉపకార వేతనాలకు దూరమవుతున్నారు.

ఆల్ ఇండియా కోటాలో 22 సీట్లు..

జిల్లాలోని వైద్య కళాశాలలో రాష్ట్ర కోటాలో 128, ఆల్ ఇండియా కోటాలో 22 మొత్తం 150 సీట్లు ఉన్నాయి. 2022 నుంచి 2024 వరకు రెండేళ్లలో ఆల్ ఇండియా కోటాలో ఏడాదికి 22 మంది చొప్పున 44 మంది ఇక్కడి కళాశాలలో చేరారు. బిహార్, ఢిల్లీ, హరియాణా, రాజస్తాన్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ ఎంబీబీఎస్ చేస్తున్నారు. ఈ ఏడాది కూడా మరో 22 మంది విద్యార్థులు రానున్నారు. వైద్య కళాశాల అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి కోడ్ కేటాయింపు జరగలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా ఏఐఎస్‌హెచ్‌ఈ వెబ్‌సైట్‌లో కళాశాల పేరు కనిపించక రెండేళ్లుగా విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. అయితే కోడ్ కేటాయింపు కోరుతూ తాము నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు మెయిల్ పంపినా అక్కడి నుంచి ఎలాంటి సమాచారమూ లేదని కళాశాల అధికారులు పేర్కొంటున్నారు. ఇదే విషయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు.

రాష్ట్ర కోటాలో 13 మందికే స్కాలర్ షిప్

జిల్లా వైద్య కళాశాలలో 2022 నుంచి 24 వరకు 162 మంది మెడికోలు స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ విద్యార్థులు ఉన్నారు. 162 మందిలో కేవలం 13 మందికి మాత్రమే స్కాలర్ షిప్ అందింది. అది కూడా నాలుగు నెలలకే వచ్చింది. మిగతా 159 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఉపకార వేతనాలు అందడం లేదు. వెరసి ప్రభుత్వం, అధికారుల తీరుతో వైద్యకళాశాల విద్యార్థులు స్కాలర్ షిప్ అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో జాప్యం

జిల్లా వైద్య కళాశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల చెల్లింపులో కొందరు అధికారులు జాప్యం చేశారని ఆరోపణలు వస్తున్నాయి. ఆరు నెలల నుంచి వారి వేతనాలకు సంబంధించిన బిల్లులు చేయకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదు. బిల్లుల చెల్లింపులో కమీషన్ల కోసం కొందరు అధికారులు కాలయాపన చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు బిల్లులు పూర్తయినట్లు తెలుస్తోంది.

కోడ్ కోసం కృషి చేస్తున్నాం



ప్రభుత్వ వైద్య కళాశాలకు కోడ్ కేటాయించాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి ప్రతిపాదనలు పంపించాం. పది రోజుల్లో కోడ్ వచ్చే అవకాశం ఉంది. కోడ్ రాగానే స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ కళాశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల బిల్లులు చేశాం. వారికి ఈ నెల 28వ తేదీలోపు వేతనాలు అందుతాయి. వైద్య కళాశాలలో ఏ సమస్య తలెత్తినా తక్షణమే పరిష్కరిస్తున్నాం.

– రాజకుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ముగిసిన జోనల్ క్రీడలు



వాలీబాల్ విజేతలతో ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

- రెండు రోజులపాటు గిరిజన బాలబాలికలకు పోటీలు
- కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో ఎనిమిది క్రీడాంశాల్లో నిర్వహణ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఐటీడీఏ పీఓ

పాల్వంచరూరల్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలల విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల నుంచి బాలబాలికలు పోటీలకు హాజరై సత్తా చూపారు. పాల్వంచ మండల పరిధి కిన్నెరసానిలోని ఆశ్రమ క్రీడా పాఠశాలలో మొదటి రోజు బాలికలకు, రెండో రోజు బాలురకు క్రీడలు నిర్వహించారు. శనివారం కబడ్డీ వాలీబాల్, అథ్లెటిక్స్, ఆర్చరీ, ఖోఖో తదితర పోటీల్లో 400 మంది బాలురు పాల్గొన్నారు. క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరైన ఐటీడీఏ పీఓ రాహుల్ మధ్యాహ్నం సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలు తీరుపై ఆరా తీశారు.

రాష్ట్రస్థాయికి 240 మంది ఎంపిక

గిరిజన పాఠశాలల జోనల్‌స్థాయి క్రీడాపోటీల్లో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని అన్ని ఆశ్రమ పాఠశాలల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొనగా 8 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు ఐటీడీఏ డీడీ మణెమ్మ తెలిపారు. ప్రతిభ చూపిన 240 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామని పేర్కొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడలు మానసిక వికాసానికి దోహద పడతాయని అన్నారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాల్సిన బాధ్యత పీఈటీలు, కోచ్‌లదేనని అన్నారు. పాఠశాలలకు వాలీబాల్ కిట్లను అందజేస్తామని తెలిపారు. స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాల్‌రావు, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు చంద్రమోహన్, జహీరుద్దీన్, అశోక్‌కుమార్, ఏఎస్ఓ వెంకటనారాయణ, హెచ్‌ఎం ఎల్.రామారావు పీఈటీలు, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడి ఏసీ ఫంక్షన్‌హాల్ లీజు రద్దు

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడికి చెందిన మొదటి ఏసీ ఫంక్షన్ హాల్ లీజు హక్కును రద్దు చేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి అనుబంధంగా ఉన్న 700 మంది సీటింగ్ సామర్థ్యం కలిగిన ఫంక్షన్ హాల్‌ను బ్రహ్మసాని హరీష్ అనే వ్యక్తి లీజుకు తీసుకున్నారని తెలిపారు. అయితే లీజుకు సంబంధించిన రెండో ఇన్‌స్టాల్‌మెంట్ రూ.20.02 లక్షలు చెల్లించలేదని, స్టాంప్‌పేపర్‌పై అగ్రిమెంట్ చేయించుకోలేదని వివరించారు. వేలం నిబంధనలు పాటించకుండా హాల్‌ను ఫంక్షన్లకు అద్దెకు ఇస్తున్నందున లీజును రద్దు చేసినట్లు ఈఓ తెలిపారు. ఈ ఫంక్షన్ హాల్ బుకింగ్ కోసం దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి భానుమతి

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ఉన్నత శిఖరాల ను అధిరోహించాలని న్యాయమూర్తి భానుమతి సూచించారు. శనివారం బాబుక్యాంపు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికల ప్రాథమిక హక్కులైన పౌష్టికాహారం, విద్య సక్రమంగా అందేలా చూడాలన్నారు. లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తే బాలికలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణిస్తారని పేర్కొన్నారు. మానసిక బలం సాధించడం ద్వారా ప్రతికూల పరిస్థితులను సైతం అధిగమించే ఆత్మస్థైర్యం పెంపొందుతుందని అన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తంరావు, డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, అసిస్టెంట్ కౌన్సిల్స్ నాగస్రవంతి, జ్యోతి విశ్వకర్మ, బాబు క్యాంపు పాఠశాల హెడ్ మాస్టర్ బి. నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పశువైద్యాధికారుల నియామకం

పాల్వంచరూరల్: ఎట్టకేలకు జిల్లాలో ఖాళీగా ఉన్న పశువైద్యాధికారుల పోస్టులను భర్తీ చేశారు. అనేక సంవత్సరాలుగా జిల్లాలో పశువైద్యాధికారులు లేకపోవడతో గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్యసేవలు అందడంలేదు. తాజాగా చేపట్టిన నియామకాల్లో ప్రభుత్వం జిల్లాకు 19 మంది పశువైద్యాధికారులను నియమించింది. శనివారం 10 మంది విధుల్లో చేరారని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ పురంధర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 30 పశువైద్యశాలలు ఉన్నాయి. వీటిల్లో అశ్వాపురం పశువైద్యశాలలో పశువైద్యాధికారి షేక్ రూబీనా, బోడులో ఎం.సురేష్, ఆళ్లపల్లిలో జె.వివేక్, ఏడూళ్లబయ్యారంలో కె.ఉజ్వల, నాగుపల్లిలో శ్యామ్‌బాబు, పట్వారిగూడెంలో ఎం.ప్రశాంత్, దమ్మపేటలో యు.తేజరాణి, సుజాతనగర్‌లో కాత్యాయని, జూలూరుపాడులో జి.సాయిరాం సందీప్ బాధ్యతలు చేపట్టారు. మిగిలిన కరకగూడెం, చర్ల, నాగారం, ఎంపీ బంజర, యానంబైల్, ఎర్రగుంట, నారాయణపురం, టేకులపల్లి పశువైద్యాధికారులు సోమవారం విధుల్లో చేరతారని జిల్లాపశువైద్యాధికారి వివరించారు.

భూసేకరణే కీలకం

- నష్టపరిహారం న్యాయంగా చెల్లిస్తే సమస్య పరిష్కారం
- భద్రాచలం రామాలయ అభివృద్ధిలో తొలగనున్న ప్రధాన అడ్డంకి
- ఇళ్ల సర్వే చేపట్టిన రెవెన్యూ, దేవస్థాన అధికారులు



దేవస్థానం పక్కన దుకాణాల వద్ద కొలతలు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధిలో భూ సేకరణే కీలకంగా మారింది. ఈ ప్రక్రియ సజావుగా పూర్తయితే అభివృద్ధి పనులు వేగవంతమవుతాయి. మాడ వీధుల విస్తరణలో భూమి, ఇళ్లు కోల్పోయే నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.60.40 కోట్లను విడుదల చేయగా, రెవెన్యూ, దేవస్థానం అధికారులు భూ సేకరణకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే శుక్రవారం గ్రామపంచాయతీ స్పెషలాఫీసర్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. శనివారం ఆలయ మూడు వైపులా సేకరించాల్సిన స్థలం సర్వే చేశారు. మొత్తం 46 ఇళ్లను సర్వే చేయాల్సిఉండగా, 34 ఇళ్లకు కొలతలు వేశారు. ఇంకా 12 ఇళ్ల కొలతలు సేకరించాల్సి ఉంది. పలు దుకాణాల వద్ద కూడా కొలతలు వేశారు. కాగా నిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారంపై అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం భద్రాచలం సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో చదరపు అడుగుకు నివాస భూమికి రూ.5,800, కమర్షియల్ భూమికి చదరపు అడుగుకు రూ.7,800 ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ మొత్తానికి మూడు రెట్లు అదనంగా నిర్వాసితులకు పరిహారంగా అందించనున్నారు. భూ సర్వే అనంతరం పబ్లిక్ నోటిఫికేషన్ విడుదల చేసి అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా స్వీకరిస్తారు. ఆ తర్వాత మళ్లీ గ్రామసభ నిర్వహించి నష్టపరిహారం ప్రకటిస్తారు. పరిహారం ఆమోదం పొందాక భూమి సేకరిస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే మళ్లీ నిర్వాసితులతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులు సమన్వయంతో పూర్తిచేయగలిగితే..

మాడ వీధుల విస్తరణకు చేపట్టిన భూ సేకరణ పూర్తయితే మొదటి గండం గట్టెక్కినట్లే. మాడ వీధుల విస్తరణకు ప్రభుత్వం గతంలో ఓ సారి ప్రయత్నించగా, ఉత్తరమెట్ల వైపు ఉన్న అర్చకులు కోర్టును ఆశ్రయించారు. దీంత ఆ ప్రక్రియ నిలిచిపోయింది. మళ్లీ భూ సేకరణ ప్రక్రియ జరుగుతుండటంతో అందరిలో టెన్షన్ నెలకొంది. కోర్టుకు వెళ్లకుండా నిర్వాసితులకు న్యాయంగా నష్టపరిహారం అందించాల్సి ఉంది. చిరు దుకాణాలు, బొమ్మల దుకాణాల వ్యాపారులకు కూడా న్యాయం చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను ఉన్నతాధికారులు సమన్వయంతో పూర్తిచేయగలిగితే ఆలయ అభివృద్ధిలో ప్రధాన అడ్డంకి తొలగిపోతుంది. అనంతరం ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. కాగా హైదరాబాద్‌లో ఆలయ నూతన మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన జరుగుతుండగా, ప్రభుత్వం త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

త్వరితగతిన పూర్తి చేస్తాం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీలయినంత త్వరగా భూ సేకరణ పూర్తి చేస్తాం. ఇప్పటికే స్పెషలాఫీసర్, ఐటీడీఏ పీఓ రాహుల్ ఆధ్వర్యంలో గ్రామసభ పూర్తి చేశాం. రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది భూ కొలతలను చేస్తున్నారు. ఈ తతంగం పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదించి, పబ్లిక్ నోటిఫికేషన్ విడుదల చేస్తాం.

–దామోదర్‌రావు, ఆర్డీఓ, భద్రాచలం

సమగ్రాభివృద్ధికి కృషి చేద్దాం

- కేంద్ర పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలి
- దిశ సమావేశంలో ఎంపీలు బలరాం, రఘురాంరెడ్డి



దిశ సమావేశంలో మాట్లాడుతున్న మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, వేదికపై ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్, పీఓ రాహుల్

చుంచుపల్లి: జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తూ సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని మహబూబాబాద్, ఖమ్మం ఎంపీలు పోరిక బలరాం నాయక్, రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల తీరుతెన్నులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలు, గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కొత్త పథకాలను ప్రవేశపెట్టడంతోపాటు బడ్జెట్‌లో ఎక్కువ మొత్తం నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థలపై మరింత కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరం ఉన్నదని అన్నారు. నియోజకవర్గాల్లో మారుమూల ప్రాంతాల్లో కరెంటు, తాగునీటి, రోడ్ల సమస్య లేకుండా చూడాలని, జిల్లా పరిషత్ పాఠశాలలు, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మాతా శిశు కేంద్రాల్లో అన్ని రకాల వసతి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తనిఖీలు చేపడుతూ సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులు నియోజకవర్గాల వారీగా సక్రమంగా వినియోగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. శాసనసభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను గుర్తించి నిధులు కేటాయించి పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు అన్ని విధాలా అండగా నిలవాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేదుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు తోడ్పాటునందిస్తున్నారని చెప్పారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. అధికారులందరూ సమష్టిగా పనిచేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ పథకాలపై సుదీర్ఘంగా చర్చించామని, వచ్చే సమావేశానికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకుని అన్ని అంశాలపై సమీక్షిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట, వైరా ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, మాలోత్ రాందాస్ నాయక్, ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యాచందన, కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్లు కాపు సీతాలక్ష్మి, డి. వెంకటేశ్వరరావు, దిశా కమిటీ సభ్యులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీమా పరిహారం చెల్లించండి

ఖమ్మంలీగల్: వాహనం కారణంగా జరిగిన నష్టానికి గాను ఫిర్యాదికి బీమా పరిహారంతో పాటు, ఖర్చులు చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత తీర్పు ఇచ్చారు. శనివారం వెలువరించిన ఈ తీర్పు వివరాలు.. భద్రాద్రి జిల్లాలోని పాల్వంచకు చెందిన కిశోర్ కన్‌స్ట్రక్షన్స్ యజమాని కిశోర్ తన టిప్పర్‌ను ఓ కంపెనీలో రవాణాకు ఉపయోగించాడు. అంతేకాక 2022 నవంబర్ 16న టిప్పర్‌కు చోళ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా చేయించాడు. కాగా, 2023 సెప్టెంబర్ 27న టిప్పర్ ప్రమాదానికి గురైన విషయాన్ని బీమా కంపెనీకి తెలియ చేసినా స్పందించలేదు. దీంతో కిశోర్ తన న్యాయవాది ముప్పా నాగేశ్వరరావు ద్వారా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు బీమా కింద రూ.1.37 లక్షలతో పాటు నష్టపరిహారం రూ.10 వేలు, ఖర్చుల కింద మరో రూ.10 వేలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పాల్వంచరూరల్: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని రాజాపురం వద్ద శనివారం హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాములు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఉల్వనూరు నుంచి పాల్వంచ వైపు వెళ్తున్న ఆటోను పరిశీలించారు. అందులో రూ.13,750 విలువైన 11 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గట్టాయిగూడెంనకు చెందిన అప్పల శ్రీనివాస్, శేఖరంబంజరకు చెందిన ఆటోడ్రైవర్ బానోతు నరేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

గోదావరిలో గల్లంతవుతున్న వారిని రక్షించిన గజఈతగాడు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతవుతున్న ఇద్దరు వ్యక్తులను శనివారం గతఈతగాడు ప్రసాద్ రక్షించాడు. అయితే, వారి వివరాలు తెలియరాలేదు. శుక్రవారం ఇలాంటి ఘటనే చోటు చేసుకోగా ఫొటోగ్రాఫర్ కాపాడాడు. 24 గంటలు గడవక ముందే మరో ఘటన చోటుచేసుకుంది. ఇప్పటికైనా అధికారులు గోదావరి వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.17,043

టీయూసీఐలో విలీనం కానున్న 'ఇఫ్టూ'

- మాస్‌లైన్ అనుబంధ సంఘం విలీనానికి ఏర్పాట్లు
- నేడు హైదరాబాద్‌లో బహిరంగ సభ

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్–మాస్‌లైన్) అనుబంధ ఇఫ్టూ 14 రాష్ట్రాల్లో పనిచేస్తున్న ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ)లో విలీనం కానుంది. ఏడాది కాలంగా ఇరుసంఘాల నాయకుల మధ్య జరుగుతున్న చర్చలు ఫలించాయి. దీంతో ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభలో రెండు కార్మిక సంఘాల నాయకులు విలీన ప్రకటన చేస్తారు. ఈమేరకు సభ విజయవంతానికి నాయకులు విస్తృత ప్రచారం చేశారు.

1978లో ఏర్పాటు

జాతీయోద్యమ కాలాన 1920లో ఏఐటీయూసీ, 1947లో ఐఎన్‌టీయూసీ ఏర్పడ్డాయి. ఆ తర్వాత 1978లో ఐఎఫ్‌టీయూ ఏర్పడింది. నాటి నుంచి నేటి వరకు 26 రంగాల్లో లక్ష సభ్యత్వం కలిగిన ఇఫ్టూ బలమైన కార్మిక వర్గంగా కొనసాగుతోంది. ప్రధానంగా సింగరేణి, పెంకు, బీడీ, భవన, ఆటో, మోటార్, కేజీబీవీ, హమాలీ, మిల్, గోదాం వర్కర్స్, జీపీ తదితర రంగాల్లో కార్మికుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతోంది. అయితే, రకరకాల పరిణామాలతో ఇఫ్టూ పేరిట పలు సంఘాలు ఏర్పడ్డాయి. మాస్‌లైన్ అనుబంధంగా కొనసాగుతున్న ఇఫ్టూతో పాటు ఎన్డీ వైకే వర్గానికి ఒకటి, ఎన్డీ చంద్రన్న వర్గానికి ఇంకొకటి ఉంది. దీనికి తోడు సాధినేని వర్గానికి మరో ఇఫ్టూ ఉండగా.. ఈ వర్గాన్ని ఎన్డీ వైకేలో విలీనం చేయనున్నారు. ఇలా ఒకే పేరుతో రకరకాల సంఘాలు ఉండడంతో కార్మికులు గందరగోళానికి గురవుతున్న నేపథ్యాన మాస్‌లైన్ నాయకులు ఇఫ్టూను టీయూసీఐలో విలీనానికి నిర్ణయించారు.



సభ విజయవంతానికి ప్రచారం చేస్తున్న ఇఫ్టూ నాయకులు (ఫైల్)

14 రాష్ట్రాల్లో కార్యకలాపాలు

దేశవ్యాప్తంగా కార్మికవర్గంపై ప్రభుత్వాలు, యజమానుల అణిచివేత, దోపిడీ కొనసాగిస్తున్నాయని చెబుతూ నాయకులు పోరాటాలు కొనసాగిస్తున్నారు. ఈమేరకు కార్మిక వర్గ ఐక్యత, సమష్టి ఉద్యమానికి దేశ వ్యాప్తంగా కలిసొచ్చే శక్తులతో ఐక్య పోరాటాలు చేయాలని ఇఫ్టూ నేతలు నిర్ణయించారు. ఇందులో భాగంగానే తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, బెంగాల్, బిహార్, ఢిల్లీ, పంజాబ్ తదితర 14 రాష్ట్రాల్లో సంఘటిత, అసంఘటిత రంగాల్లో టీయూసీఐ బలమైన వర్గంగా ఉంది. దీంతో అందులో ఇఫ్టూను విలీనం చేయాలని నిర్ణయించిన నాయకులు ఏడాదిగా జరిపిన చర్చలు ఫలప్రదం కావడంతో ఆదివారం విలీన ప్రకటన కోసం సభ నిర్వహిస్తున్నారు.

ముమ్మరంగా సభ ఏర్పాట్లు

ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే విలీన సభ కోసం మాస్‌లైన్ అనుబంధ ఐఎఫ్‌టీయూ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కార్మికులకు వద్దకు వెళ్లి సభకు తరలిరావాలని కోరుతుండడమే కాక వాల్ పోస్టర్లు, కరపత్రాలు, వాల్ రైటింగ్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా, విలీన సభలో ఇఫ్టూ తరఫున రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనమాల కృష్ణ, కె.సూర్యంతో పాటు టీయూసీఐ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అమ్రిష్‌పటేల్, సంజయ్ సింఘ్వి, ఇఫ్టూ నుంచి ఎస్ఎల్.పద్మ, ఎం.నరేందర్, ఎం.హన్మేష్, సి.వెంకటేష్, జి.రామయ్య, కె.రాజన్న, అరుణ్‌కుమార్, సాంబశివుడు, ప్రవీణ్, యాకుబ్‌షావలీ, ప్రసాద్ తదితరులు పాల్గొంటారు.

కార్మిక వర్గం తరలి రావాలి



హైదరాబాద్‌లో జరిగే విలీన సభకు కార్మికవర్గం తరలి రావాలి. ఇఫ్టూ పేరుతో నాలుగైదు సంఘాలు ఉండడంతో కార్మికుల్లో గందరగోళం నెలకొంది. దీంతో 14 రాష్ట్రాల్లో బలమైన కార్మిక వర్గం కలిగిన టీయూసీఐలో విలీనానికి నిర్ణయించాం.

– యాకూబ్‌షావలీ, ఇఫ్టూ రాష్ట్ర నేత

ప్రజా ఉద్యమాలు నిర్వహించాలి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలను నెరవేరుస్తామని చెప్పిన కాంగ్రెస్ 10 నెలలు దాటినా అమలు చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలను పరిష్కంచకుండా పేదల ఇళ్లను కూల్చుతోందని, నాగార్జున వివాదం సృష్టించి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఒక్కో మంత్రి ఒక్కోలా మాట్లాడుతూ మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఏడు వేల కోట్లతో కాళేశ్వరం నిర్మించి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు సాగునీరు అందిస్తుండగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిన్నర కోట్లతో మూసీ ప్రక్షాళన అవసరమేమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనకు కాంగ్రెస్ పాలనకు పండితునికి, పామరుని పాలనకు ఉన్న తేడా ఉందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేసే వారికే ప్రాధాన్యత ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ భద్రాచలంలో ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉందని, అక్కడ గులాబీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అటెండర్లుగా మారారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని, అన్నీ రెడ్‌బుక్‌లో నోట్ చేస్తున్నామని, వడ్డీతో సహా బదులు తీర్చుకుంటామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్‌రెడ్డి, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, నాయకులు దిండిగాల రాజేందర్, రాంప్రసాద్, రామకృష్ణలు ప్రసంగించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ, వేదికపై ఎమ్మెల్సీ మధు, తదితరులు



నిరసన తెలుపుతున్న వాహన యజమానులు

వాహన యజమానుల నిరసన

విస్తృతస్థాయి కార్యకర్త సమావేశం నిర్వహిస్తున్న పార్టీ కార్యాలయం వద్దకు పలువురు వాహన యజమానులు చేరుకుని నిరసన తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము ఎన్నికల ప్రచారం కోసం తమ వాహనాలను పెట్టామని, ఇప్పటివరకు అద్దె డబ్బులు చెల్లించలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు వాహన యజమానులతో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

గంజాయి పట్టివేత

భద్రాచలంఅర్బన్: ఓ వ్యక్తి గంజాయి తరలిస్తుండగా టౌన్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా, అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద గంజాయి ఉన్నట్లుగా గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మంటగుండ గణేశ్.. గంజాయిని జగదల్పూర్‌లో గురుబాయి వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లుగా విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. గంజాయి విలువ రూ.4 లక్షల 42 వేలు ఉంటుందని టౌన్ ఎస్‌ఐ పీవీఎస్ రావు తెలిపారు.

పాల్వంచలో ...

పాల్వంచ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ఉంటున్న విశాఖపట్నం పెద్దగంట్యాడ మండలం కాపుతుంగలకు చెందిన బంకురు ధనుష్‌కుమార్ గంజాయికి బానిసై.. దానినే విక్రయిస్తూ జీవిస్తున్నాడు. సీలేరు నుంచి కేజీ గంజాయిని తీసుకుని భద్రాచలం నుంచి బస్సులో వచ్చి అక్కడి నుంచి ఆటోలో పాల్వంచలో దిగాడు. అనంతరం బస్టాండ్‌లో విజయవాడకు వెళ్లేందుకు వేచి ఉండగా ఎస్‌ఐ డి.రాఘవయ్య ఆకస్మిక తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ధనుష్‌కుమార్‌ను పరిశీలించారు. అతని వద్ద గంజాయి ఉండటంతో అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ కె.సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రాఘవయ్య

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

- ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు, ఒక దళ సభ్యుడు
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: నిషేధిత మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యులు పొడియం మంగు, మడవి అడిమే అలియాస్ అనూషతో పాటు దళ సభ్యుడు కుడం సోమల్ శనివారం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ అధికారుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఒక్కొక్కరిపై రూ.4 లక్షల రివార్డు ఉంది. వివరాలను కొత్తగూడెంలో ఎస్పీ రోహిత్‌రాజు శనివారం వెల్లడించారు.

'ఆపరేషన్ చేయూత'తో...

మావోయిస్టు పార్టీ చర్ల ఏరియా కమిటీ సభ్యులైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా తుమ్రేల్‌కు చెందిన పొడియం మంగు అలియాస్ దేవేందర్, భద్రాద్రి జిల్లా చర్ల మండలం కొరకట్‌కు చెందిన మడవి అడిమే అలియాస్ అనూష పోలీసుల ఎదుట లొంగిపోయారు. అలాగే, దళ సభ్యుడు ఏపీలోని ఏఎస్ఆర్ జిల్లా గొల్లగుప్పకు చెందిన కుడం సోమల్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నాడు. వీరు 2018–19లో మావోయిస్టు బీకే–ఏఎస్ఆర్ డివిజన్‌లోని చర్ల ప్లాటూన్‌లో సాయుధ దళ సభ్యులుగా చేరారు. అనంతరం మంగు, అడిమే ఏరియా కమిటీ సభ్యులుగా పదోన్నతి పొందగా, ఈ ముగ్గురిపై రివార్డు ఉంది. జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన ఆపరేషన్ చేయూతలో భాగంగా కుటుంబ సభ్యుల ప్రయత్నంతో వీరు సాధారణ జీవితం గడపాలని నిర్ణయించుకుని లొంగిపోయారని ఎస్పీ అన్నారు. కాగా, ప్రస్తుతం మావోయిస్టులు, వారి సిద్ధాంతాలకు ప్రజల్లో ఆదరణ లేకపోవడంతో సభ్యులు లొంగిపోతున్నారని తెలిపారు. ఎవరైనా లొంగిపోవాలనుకుంటే కుటుంబ సభ్యుల ద్వారా కానీ నేరుగా సమీప పోలీసుస్టేషన్లలో కానీ సంప్రదించాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు.



మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు, పక్కన అధికారులు

ఆస్ట్రేలియా కంపెనీ బాధ్యులతో సింగరేణి డైరెక్టర్ భేటీ

సింగరేణి(కొత్తగూడెం): ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్‌కు చెందిన మైనింగ్ టెక్నాలజీ విభాగం బాధ్యులు శనివారం సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వరరెడ్డితో కొత్తగూడెంలో సమావేశమయ్యారు. ఈ మేరకు తొలుత జీఎం (సీపీపీ) మనోహర్ సింగరేణి ఓసీలు, భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం డైరెక్టర్ వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణలో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లోకి అడుగు పెట్టామని తెలిపారు. అయితే, ఉత్పత్తి లక్ష్యసాధనకు అవసరమైన ఆధునిక పరిజ్ఞానం విషయమై సహకారం అందించాలని కోరారు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు చెందిన ఇంజనీర్లు తమ దేశంలో బొగ్గు ఉత్పత్తిలో భాగంగా చేపడుతున్న రక్షణ, నూతన యంత్రాలు, బొగ్గు నాణ్యత వివరాలు వెల్లడించారు. సమావేశంలో జీఎంలు సూర్యనారాయణరావు, కె.సాయిబాబు, వై.రఘురాంరెడ్డి, రాంకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సింగరేణి అధికారులు, ఆస్ట్రేలియా బృందం

విశాఖ టు రాజస్థాన్

ఆరు రాష్ట్రాల మీదుగా 1,700 కి.మీ. యాత్ర

టేకులపల్లి: నలుగురు మిత్రులు తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకునేందుకు సైకిల్ యాత్రగా బయలుదేరారు. ఈ బృందం శనివారం భద్రాద్రి జిల్లా టేకులపల్లికి చేరుకోగా వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని రాజసమంద్ జిల్లాకు చెందిన కిషన్‌లాల్ గాడ్రి, కన్నయ్యలాల్ గాడ్రి, పంబాలాల్ గాడ్రి, మంగీలాల్ గాడ్రి కొన్నేళ్లుగా ఏపీలోని విశాఖపట్నం, తుని, అనకాపల్లి ప్రాంతాల్లో ఐస్‌క్రీమ్ తయారీ వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యాన సొంత జిల్లాలో తమ ఆరాధ్యదైవమైన శ్రీదేవ్‌నారాయణ్ (విష్ణుమూర్తి) దర్శనానికి సైకిల్ యాత్రగా బయలుదేరారు. ఈ నెల 17న తుని నుంచి మొదలైన వీరి యాత్ర విశాఖపట్నం, రాజమండ్రి, భద్రాచలం, కొత్తగూడెం, టేకులపల్లి, ఇల్లెందు, మహబూబాబాద్, వరంగల్ నుంచి కొనసాగుతూ నాగ్‌పూర్, భోపాల్, ఇండోర్, ఇటార్సీ, నింబాడా మీదుగా రాజసమంద్ జిల్లాకు చేరుకోనున్నారు. మొత్తంగా ఆరు రాష్ట్రాల్లో 18 రోజుల పాటు 1,700 కి.మీ. మేర సైకిల్ యాత్ర కొనసాగుతుందని వారు తెలిపారు.



రాజస్థాన్‌కు సైకిళ్లపై వెళ్తున్న యువకులు

రేషన్ డీలర్‌ను హతమార్చిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూరుకు చెందిన రేషన్ డీలర్‌ను శనివారం మావోయిస్టులు హతమార్చారు. ఊసూరుకు చెందిన బండారు తిరుపతి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉంటూనే రేషన్ డీలర్‌గా కొనసాగుతున్నాడు. వ్యవసాయం కూడా చేస్తుంటాడు. కొంతకాలం క్రితం ఇతను కుటుంబంతో సమీపంలోని మారేడుబాకకు మకాం మార్చాడు. శనివారం ఊసూరుకు వచ్చి రేషన్ దుకాణంలో ఆదివాసీలకు రేషన్ ఇస్తున్న ఇస్తుండగా ఓ ట్రాక్టర్‌లో సాధారణ వ్యక్తుల్లా వచ్చిన ఆరుగురు మావోయిస్టులు రేషన్ షాపులోనే హతమార్చేందుకు యత్నించారు. అక్కడి నుంచి తిరుపతి పరుగెత్తుతుండగా వెంబడించి ఊరుబయట పట్టుకుని దారుణంగా పొడిచి చంపారు. తిరుపతి సోదరుడిని కూడా హతమార్చేందుకు యత్నించగా, అతను పోలీస్ స్టేషన్ వైపునకు పారిపోయాడు. తిరుపతి దొరకడంతో అతడిని మావోయిస్టులు హతమార్చారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందు వల్లే ఇతనిని మావోయిస్టులు హతమార్చినట్లుగా అనుమానిస్తున్నారు.

అటవీ ఉద్యోగి ఆత్మహత్య



ముకుంద (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న అటవీ ఉద్యోగి లకావత్ ముకుంద (50) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా పాల్వంచలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ముకుంద భార్య, పిల్లలు ఊరు వెళ్లగా.. తలుపులు వేసుకుని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే, ఆయన ఎంతకూ తలుపులు తీయకపోవడంతో సమీప ప్లాట్ల యజమానులు ఇచ్చిన సమాచారంతో భార్యాపిల్లలు చేరుకుని బలవంతంగా తలుపులు తీయగా ముకుంద మృతి చెందినట్లు గుర్తించారు. ఖమ్మం అర్బన్ ఎస్‌ఐ వరాల శ్రీను చేరుకుని మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అయితే, ముకుంద ఎప్పుడు, ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియాల్సి ఉంది. ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



శంకర్ (ఫైల్)

సుజాతనగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన గుగులోతు శంకర్ (53) ఈ నెల 17వ తేదీన ద్విచక్రవాహనంపై కొత్తగూడెంనకు వెళ్తూ రోడ్డు దాటుతున్న క్రమంలో ఖమ్మం వైపు నుంచి వచ్చిన రెండు కార్లు ఢీకొట్టాయి. తీవ్రగాయాలైన శంకర్‌ను కొత్తగూడెం ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరూ కుమారులు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వ్యక్తి..

సుజాతనగర్: గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన సీతంపేట బంజరలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన హమాలీ లావుడ్యా హతిరామ్(44) శనివారం నిద్రలేవగానే గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతిచెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విజయవాడలో రోడ్డు ప్రమాదం..

మండలానికి చెందిన వివాహిత మృతి

అశ్వాపురం: విజయవాడలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అశ్వాపురం గ్రామానికి చెందిన వివాహిత మైపా సుజాత (28) మృతి చెందింది. గ్రామానికి చెందిన మైపా సుజాతకు ఏడాది కిందట వివాహం కాగా భర్తతో కలిసి విజయవాడలో ఉంటోంది. భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి లారీ కింద పడటంతో సుజాత మృతి చెందింది.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



టేకులపల్లి: పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. తావుర్యా తండా పంచాయతీ స్టేషన్‌తడికలపూడి గ్రామానికి చెందిన దరంసోత్ సిరి శనివారం రాత్రి చేను నుంచి తన ఎద్దుని తీసుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు పిడుగుపడటంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. వ్యవసాయానికి ఆధారమైన ఎద్దు చనిపోవడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు.

అనారోగ్యానికి గురైన చిన్నారి

వైద్యులు అందుబాటులో లేక మృతి!

చర్ల: మండలంలోని లెనిన్‌కాలనీకి చెందిన ఓ చిన్నారి శుక్రవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా అనారోగ్యానికి గురవ్వగా చర్లకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి భద్రాచలానికి తరలించగా చిన్నపిల్లల వైద్యులు లేక.. సకాలంలో చికిత్స అందక శనివారం ఉదయం మృతి చెందింది. లెనిన్‌కాలనీకి చెందిన మిచ్చా నాగరాజు, కృష్ణవేణి దంపతుల ఆరు నెలల పాపకు శుక్రవారం అర్ధరాత్రి ఉన్నట్లుండి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది ఎదురైంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చర్ల ప్రభుత్వ వైద్యశాలకు అక్కడి నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు లేరని, ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాలని సిబ్బంది సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రులన్నింటికీ తిరిగినా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తమ బిడ్డ మృతి చెందిందని తల్లిదండ్రులు బోరున విలపించారు. చిన్నారి మృతదేహాన్ని శనివారం మధ్యాహ్నం స్వగ్రామమైన లెనిన్‌కాలనీకి తరలించారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ కార్యకర్త..



నగదు అందజేస్తున్న సీడీపీఓ జయలక్ష్మి

పినపాక: పోతిరెడ్డిపల్లి అంగన్వాడీ కార్యకర్త గద్దం సత్యవతి (60) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. విధులకు హాజరైన ఆమె ఛాతిలో నొప్పిగా ఉందంటూ కుప్పకూలిపోయారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సీడీపీఓ జయలక్ష్మి నివాళులర్పించి.. ఐసీడీఎస్ తరఫున దహన సంస్కారాల నిమిత్తం రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో పినపాక, కరకగూడెం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ లీక్ అయి వ్యక్తికి గాయాలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని పాత మార్కెట్ ప్రాంతంలో ఉన్న రెడ్ బకెట్ బిర్యానీ పాయింట్‌లో శనివారం ఉదయం గ్యాస్ లీక్ అయి, మంటలు చెలరేగి అందులో పనిచేసే వ్యక్తికి గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని నిర్వాహకులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటలో వ్యక్తి రెండు చేతులు కాలగా, కాలికి కూడా గాయాలయ్యాయి. ప్రస్తుతం ఖాన్ ఆరోగ్యంగానే ఉన్నట్లు సమాచారం.